క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.58,116 విరాళం



నగదు అందిస్తున్న శ్రీనివాసరావు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం పట్టణానికి చెందిన బోసు శ్రీనివాసరావు రూ.58,116లు విరాళంగా అందించారు. అదే విధంగా రఘురాం ఆర్థోఫెడిక్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రఘురాం రూ.10,116లు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ద్రోణంరాజు మల్లికార్జున్ శర్మ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చింతకాని: మండలంలోని చిన్నమండవ గ్రామంలో ఉరేసుకుని మృతి చెందిన తుపాకుల అగ్గిరాములు కుటుంబానికి బీఆర్ఎస్ గ్రామశాఖ నాయకులు సోమవారం రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పర్సగాని ఏడుకొండలు, మరీదు లక్ష్మీనారాయణ, ఏసోబు, నాగరాజు, ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



ప్యాడ్లు అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి జెడ్పీహెచ్ఎస్ 10వ తరగతి విద్యార్థులకు సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ బాధ్యులు చింతలపూడి వెంకటేశ్వరరావు, గుడిపూడి వెంకటేశ్వరరావు, మరికంటి రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థినుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ముదిగొండ: మండలం యడవల్లి జెడ్పీఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ములుగు జిల్లా మేడారంలో జరిగిన 7వ రాష్ట్రలెవల్ సోటోకాన్ కరాటేలో చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించినట్లు సోమవారం పాఠశాల హెచ్ఎం నాగలక్ష్మి తెలిపారు. ఈ నెల 2న జరిగిన కరాటేలో 7వ, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు రజిత, భవ్య, శ్రావణి, లలిత గోల్డ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. దీంతో కోచ్ రామకృష్ణను, విద్యార్థినులను.. పాఠశాల హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

పశువైద్య శిబిరం విజయవంతం

పెనుబల్లి: మండలంలోని గంగదేవిపాడులో సోమవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరం విజయవంతమైంది. పశువైద్యాధికారి సృజన పశువులకు చూలు పరీక్షలు నిర్వహించారు. గర్భకోశ వ్యాధులకు, కృత్రిమ గర్భ దారణకు, దూడల్లో నత్తల నివారణకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, నాయకులు కాకా వెంకటేశ్వర్లు, మాళోతు రాధా కృష్ణ, రైతులు, గోపాల మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కూపన్లు పొందాలి

ముదిగొండ: మండలంలోని గంధసిరి, పెద్దమండవ మున్నేరుల నుంచి ఇసుక తరలించుకోవడానికి ప్రభుత్వ పరంగా బ్యాంకులో డీడీలు తీసి ఇసుక కూపన్లు పొందాలని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ట్రక్కు ఇసుక కోసం రూ.1,500 బ్యాంకులో చెల్లించి, డీడీ తీసి తహసీల్‌లో అందించి కూపన్ పొందాలన్నారు. ఇసుక అక్రమ రవాణా చేపడితే చర్యలు తప్పవన్నారు.

పక్కా భవనం నిర్మించాలి

కారేపల్లి: మండలంలోని సింగరేణి(కారేపల్లి)లో నూతన జీపీ భవనానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ.. సోమవారం తహసీల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో గ్రామస్తులు వినతి అందించారు. 40ఏళ్లగా జీపీ కార్యలయం, గ్రంథాలయానికి చెందిన భవనంలో కొనసాగింది. ఇదికూడా శిథిలావస్థకు చేరడంతో.. కారేపల్లిస్టేషన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 38లో గల 2ఎకరాల భూమిలో నూతన భవనాన్ని నిర్మించాలని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తురక నారాయణ, ఆదెర్ల శంకర్, మజీద్ పాషా, మురళీ తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న ప్రజల కష్టాలు

ఎర్రుపాలెం, ముదిగొండ మండల కేంద్రాల్లో సీహెచ్‌సీలు

- ఉత్తర్వులతో పాటు నిధులు మంజూరు
- చొరవ చూపిన డిప్యూటీ సీఎం భట్టి



శిథిలావస్థలో ఉన్న ముదిగొండ ప్రభుత్వ ఆస్పత్రి భవనాలు



ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మధిర: మధిర నియోజకవర్గ పరిధిలోని ముదిగొండ, ఎర్రుపాలెం మండల కేంద్రాలకు కమ్యూనిటీ హెల్త్ కేర్ సెంటర్లు మంజూరయ్యాయి. ఈ రెండు మండలాల ప్రజల దశాబ్దాల కళ ఫలించింది. ఇప్పటివరకు అనారోగ్యం పాలైతే ఖమ్మం లేదా విజయవాడ పరుగులు పెట్టేది. పదుల కిలోమీటర్లు ప్రయాణించి లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సవచ్చేది. అనేక సంవత్సరాలుగా మండల ప్రజలు ఎదురుచూస్తున్న సీహెచ్‌సీ సెంటర్లు ఎట్టకేలకు మంజూరు కావడంతో ముదిగొండ, ఎర్రుపాలెం మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భట్టి కృషితోనే..

నియోజకవర్గంలో విద్య, వైద్యం, సాగు రంగాల్లో శాశ్వత పరిష్కారం చూపించేలా డిప్యూటీ సీఎం, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క శరవేగంగా అనుమతులు సాధిస్తున్నారు. దీనిలో భాగంగానే రెండు మండలాలకు 50 పడకల ఆస్పత్రుల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొచ్చారు. ఆధునిక భవనం, వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య పరికరాలు అందుబాటులో ఉండి రోగి సమస్య తీరేవరకు అవసరమైన అన్ని సదుపాయాలు నూతన ఆస్పత్రిలో అందుబాటులోకి రానున్నాయి. ఇకపై చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు అన్ని ఉచిత వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే నియోజకవర్గ కేంద్రమైన మధిరలో 100 పడకల ఆస్పత్రి ఉంది.

ముదిగొండలో..

ముదిగొండ మండల వ్యాప్తంగా 60 జనాభా ఉన్నారు. కానీ ముదిగొండ మండలకేంద్రలో సుమారు 6వేల మంది జనాభాకు గానూ.. ఆరు పడకల పీహెచ్‌సీ ఉంది. కానీ ఆపరేషన్ థియేటర్, ఇతర భవన సముదాయం, వైద్యుల భవనాలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీని.. 50 పడకల ఆస్పత్రిగా అప్ గ్రేడ్ చేస్తూ కమ్యూనిటీ హెల్త్ కేర్ సెంటర్ నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని నిర్మాణానికి రూ.22 కోట్లు నిధులు కూడా మంజూరయ్యాయి.

ఎర్రుపాలెంలో..

సుమారు 6వేల మందికి పైగా ఉన్న ఎర్రుపాలెం మండల కేంద్రంలో ఇప్పటివరకు ఒక్క పీహెచ్‌సీకూడా లేదు. 55వేల జనాభా కలిగిన ముదిగొండ మండలంలో.. బనిగండ్లపాడు గ్రామంలో మాత్రమే పీహెచ్‌సీ ఉంది. గతంలో 30 పడకల ఆస్పత్రిగా ఉన్న పీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు కానీ.. అందుకు సరిపడా భవన సదుపాయం, ఇన్ఫ్రాస్ట్రక్చర్ లేదు. పేద ప్రజలు వైద్యం చేయించుకోవాలంటే సుమారు 30కిలోమీటర్లు దూరం ప్రయాణించి పీహెచ్‌సీకి రావాలి. విషయం తెలుసుకున్న భట్టి ఎర్రుపాలెం మండల కేంద్రంలో సీహెచ్‌సీ నిర్మాణానికై రూ.22కోట్లు నిధులు మంజూరు చేయించారు.

సీహెచ్‌సీల మంజూరుపై హర్షం

ఎర్రుపాలెం/ముదిగొండ: ఎర్రుపాలెం, ముదిగొండ మండల కేంద్రాల్లో 50 పడకలతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సీహెచ్‌సీ) మంజూరు చేయించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ మేరకు సెంటర్లతో పాటు ఎర్రుపాలెంలో భవన నిర్మాణానికి రూ.22కోట్ల నిధులు కూడా మంజూరు చేయించారని, తద్వారా ఈ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రులు మంజూరు చేయించిన భట్టికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మధిర మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ ఎర్రుపాలెం, ముదిగొండ మండలాల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కొమ్మినేని రమేష్‌బాబు, మాజీ జెడ్పీటీసీలు మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

అందుబాటులోకి వైద్య సేవలు..



మండల కేంద్రంగా ఉన్న ఎర్రుపాలెంలో ప్రభుత్వ ఆస్పత్రి లేదు. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే సుదూర ప్రాంతంలో ఉన్న బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్తున్నారు. మా దీన పరిస్థితి తెలుసుకున్న డిప్యూటీ సీఎం మెరుగైన వైద్యం అందించేందుకు సీహెచ్‌సీ మంజూరు చేయించారు.

– వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎర్రుపాలెం

మా బాధలు తీరనున్నాయి..



రోగం వస్తే ఖమ్మం లేదా విజయవాడ వెళ్లాల్సి వచ్చేది. ముదిగొండలో ప్రస్తుతం ఉన్న ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో డాక్టర్లు లేరు. సరైన సౌకర్యాలు లేవు. ఉన్న ఆస్పత్రిని పెద్ద ఆస్పత్రిగా మారుస్తూ మంచి భవనాలు కట్టి వైద్యులను అందుబాటులో ఉంచితే మా బాధలు తొలగిపోతాయి.

– ఆళ్లకుంట యల్లమ్మ, ముదిగొండ

డప్పు ప్రదర్శనను విజయవంతం చేయండి



మధిర: మాట్లాడుతున్న సునీల్

మధిర/వేంసూరు: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ ఈనెల 5న ఖమ్మంలో జరిగే మాదిగల మహా డప్పు ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఏసు పిలుపునిచ్చారు. సోమవారం మధిరలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మేకల రాజా మాదిగ అధ్యక్షతన, వేంసూరులోని మర్లపాడులో జరిగిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో ఏబీసీ గ్రూపులుగా కాకుండా ఏబీసీడీ గ్రూపులుగా కేటాయించి అన్ని కులాలకు సమన్యాయం చేయాలని తెలిపారు. అదేవిధంగా మధిర మండల మాదిగల మహా డప్పు ప్రదర్శనను కూడా విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కనకపుడి శ్రీను, దోర్నాల ఆంజనేయులు, ఇర్మియ, వెంకటేశ్వర్లు, పుల్లయ్య, ప్రసాద్, సాంబయ్య, వెంకటేశ్వరరావు, కోటమర్తి బాలస్వామి, కిన్నెర లాజర్, కొండలరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో సెమినార్



బాలికలకు సర్టిఫికెట్లు అందిస్తున్న టాస్ అధ్యక్షుడు మోహన్‌రావు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ వారి ఆధ్వర్యంలో భారతీయ యువత అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ మోహన్‌రావు, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, మహబూబాబాద్ గణిత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాంబశివరావులు ముఖ్య అతిథులుగా హాజరై బాలికల నుద్దేశించి ప్రసంగించారు. సైన్స్ లేనిదే జీవితం లేదన్నారు. బాలికలు చక్కగా చదువుకుని జీవితంలో రాణించాలన్నారు. అనంతరం బాలికలు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులు పరిశీలించి అభినందించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కేపీ ఐశ్వర్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రజిత, వైస్ ప్రిన్సిపాల్ నవ్య, సీజీసీ కోఆర్డినేటర్ రజని, పరీక్షల విభాగం ఇన్‌చార్జ్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఉషాశారద

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పలువురు తమ తమ సమస్యలపై ఆయా శాఖల అధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు. జమలాపురం పెద్ద చెరువుకు సాగర్ జలాలను విడుదల చేయాలని తెల్లపాలెం గ్రామానికి చెందిన రైతు వేమిరెడ్డి మల్లారెడ్డి తహసీల్దార్ ఉషాశారదకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీఓ కృష్ణశ్రీ, ఏఓ సాయిశివ, ఏపీఎం హరినారాయణ, ఏపీఓ నాగరాజు తదితరులున్నారు.

శరవేగంగా రైల్వే లైన్ పనులు

మధిర: మధిర పట్టణంలో రైల్వే మూడో లైన్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్థానిక లడక బజారులోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మూడవ లైన్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రాకపోకలు జరగకుండా అండర్ బ్రిడ్జిని మూసివేశారు. భారీ క్రేన్ల సాయంతో అండర్ బ్రిడ్జి వద్ద భారీ బ్లాకులను అమర్చుతున్నారు. అయితే అండర్ బ్రిడ్జి మూసివేయడం, రైల్వే ఓవర్ బ్రిడ్జి మీద మరమ్మతు పనులు జరుగుతుండటం వల్ల ద్విచక్ర వాహనదారులు, ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. మూడో లైన్ నిర్మాణ పనులు పూర్తి అయ్యేవరకు రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది.

నూతన అధికారిని నియమించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు, రైతులు

తల్లాడ: నూతన ఉద్యానవన శాఖాధికారిని నియమించాలని కోరుతూ.. బీజేపీ ఆధ్వర్యంలో రైతులు తల్లాడలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలో ఆరువేల ఎకరాల్లో రైతులు సాగుచేస్తున్నా.. కనీస సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన హార్టికల్చర్ అధికారి అందుబాటులో లేకపోవడం సరికాదన్నారు. కొంతమంది రైతులకు అతనెవరో కూడా తెలియదన్నారు. రైతులకు సూచనలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ విషయమై తహసీల్దార్.. హార్టికల్చర్ ఆఫీసర్ నగేష్‌కు ఫోన్ చేసినా ఎత్తడం లేదని రైతులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటరామారావు, తేజావత్ బాలాజీ నాయక్, నాగేశ్వరరావు, కృష్ణ, కిరణ్, నరేష్, సుధాకర్, కృష్ణారావు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి



ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందిని సన్మానిస్తున్న సీడీపీఓ, సూపర్ వైజర్

వేంసూరు: ప్రతి ఒక్కరూ వృత్తి పట్ల అంకిత భావంతో పని చేయాలని సత్తుపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ కనక దుర్గ అన్నారు. భీరపల్లి సెక్టర్‌లో ముగ్గురు అంగన్‌వాడీ టీచర్లు, ఐదుగురు ఆయాలు పదవీ విరమణ పొందగా సోమవారం కుంచపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీఎస్ సూపర్ వైజర్ భవాని, అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మి, చంద్రకళ, రత్నకుమారి, వాణి, విజయలక్ష్మి, అనంతలక్ష్మి, మంగమ్మ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



మాట్లాడుతున్న సీఐ టి.కిరణ్‌కుమార్

సత్తుపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సీఐ టి.కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన త్రివేణీ పాఠశాల 10వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యసంస్థల డైరెక్టర్ జగదీష్, సింగరేణి పీఓ ప్రహ్లాద్ మాట్లాడుతూ.. పిల్లలు బాగా చదివి పుట్టిన ఊరికి, తల్లిదండ్రులతో పాటుగా చదివిన పాఠశాలలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, ఇన్‌చార్జ్ వంశీ, డైరెక్టర్ వీరేంద్ర చౌదరి, సీఆర్‌ఓ మురళీకృష్ణ, పాల ప్రసాద్, పద్మ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోలాట ప్రదర్శనలో ప్రతిభ



ప్రథమ బహుమతి సాధించిన వేలాంగిని మాత బృందం

మధిర: ఖమ్మం పట్టణంలోని కరుణగిరి మేరీమాత ఉత్సవాల్లో భాగంగా చర్చి నిర్వాహకులు ఆదివారం నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి కోలాట పోటీల్లో 25 బృందాలు పాల్గొనగా.. మాటూరుపేట గ్రామానికి చెందిన ఆర్‌సీఎం చర్చి వేలాంగిని మాత కోలాట బృందం ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి మొదటి బహుమతి గెలుపొందారు.

పంటలను పరిశీలించిన అధికారులు



పంట పొలాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ, ఇరిగేషన్ అధికారులు

కల్లూరురూరల్: మండలంలో లింగాల మేజర్, తెలగవరం మేజర్ల ఆయకట్టు కింద సాగునీరు అందక ఎండిపోతున్న వరి పైరును సోమవారం కల్లూరు ఆర్డీఓ రాజేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇరిగేషన్‌శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. లింగాల మేజర్ పరిధిలో సుమారు 20 ఎకరాల వరకు వరిపైరు నీరు అందక ఎండిపోతున్న పరిస్థితిని అధికారుల బృందం పరిశీలించింది. పెద్దకోరుకొండి మేజర్ ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు తెలుపగా.. చివరి ఆయకట్టుకు నీరందించాలని ఆర్డీఓ.. ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌ను కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరెడ్డి, కల్లూరు ఏఓ రూప, జలవనశాఖ డిప్యూటీ ఇంజనీర్లు, ఏఈలు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటను..



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న మధిర ఏడీఏ విజయచంద్ర, అధికారులు

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో ఎన్నెస్పీ కింద సాగవుతున్న పంటలను మధిర ఏడీఏ విజయచంద్ర స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. దీంతో రైతులు వారి సమస్యలను వివరిస్తూ.. వారబందీ విధానంలో సాగర్‌జలాలు విడుదల చేయడంతో చివరి భూములకు నీరందడం లేదన్నారు. ఏడీఏ స్పందిస్తూ.. ప్రస్తుతం సరిపడా నీరు ఉందని, మరో రెండు, మూడు రోజుల్లో తిరిగి జలాలు విడుదల చేస్తామని, ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు. రైతులు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏఓ, ఏఈఓ రైతులు పాల్గొన్నారు.

‘స్త్రీశక్తి టీ పాయింట్’ స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీఏ డీపీఎం రామయ్య

కారేపల్లి: స్వయం సహాయక సంఘ సభ్యురాలికు మంజూరైన స్త్రీ టీ పాయింట్ స్థలాన్ని డీఆర్‌డీఏ డీపీఎం పొట్లపింజర రామయ్య సోమవారం సందర్శించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని కొమరంభీం సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న టీ స్టాల్ పాయింట్ స్థలాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మహిళా ఆర్థిక సాధికారత సాధించే విధంగా ప్రభుత్వం మహిళలను ప్రోత్సహిస్తుందన్నారు. దీనిలో భాగంగా.. స్వయం ఉపాధి కోసం జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో ఎస్‌హెచ్‌జీ ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, సీసీలు తుమ్మలపల్లి అనీల్, భూక్యా చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మేనేజర్‌కు వినతి



సింగరేణి మేనేజర్ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: జేవీఆర్ ఓసీలో ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు దారా భీమయ్య అధ్యక్షతన గేట్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశానికి ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, సెంట్రల్ సెక్రటరీ సత్తుపల్లి బాధ్యుడు వీరస్వామి, సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. కొత్త ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు తవ్వకాలను కంపెనీ నిర్వహించాలని, లేకపోతే ఆందోళనలకు సిద్ధంగా ఉండాలని కార్మికులకు పిలుపు నిచ్చారు. ఫిట్ మీటింగ్ అనంతరం కొత్తగూడెంలోని వికే–7 ఓపెన్‌కాస్టు బొగ్గు తవ్వకాలను సింగరేణి యాజమాన్యమే చేపట్టాలని మేనేజర్ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో భరణి, డి.నర్సింహారావు, కిషోర్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, వీరభద్రు మోతీలాల్, బాలసుబ్రమణ్యం, శ్రీనివాస్, ఉపేంద్రచారి, కోటేశ్వరరావు, బన్నీ, నరేందర్, శ్రీధర్, రాంబాబు, సుధాకర్, మహేష్, విజయ్ పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన



విద్యార్థినులకు ప్యాడ్లు, పెన్నులు అందజేసిన అటవీశాఖ సిబ్బంది

పెనుబల్లి: మండలంలోని ఉప్పలచెలక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు వరల్డ్ వైల్డ్ లైఫ్ డే సందర్భంగా అటవీశాఖ సిబ్బంది వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థినులకు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓ జి.ఉమా, డీవైఆర్‌ఓ సురేష్ కుమార్, ఎఫ్ఎస్‌ఓ కాలు, ఎఫ్‌బీఓ లు లావణ్య, అరుణ, నాగరాజు, సమత, మస్తాన్, ప్రసాద్, లింగం, బేస్ క్యాంపు సిబ్బంది కృష్ణా, నవీన్, టీఏ అనీల్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ నూతన భవనం ప్రారంభం

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నూతన భవనాన్ని బ్యాంక్ సిబ్బంది సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖాతాదారులకు బ్యాంక్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, గ్రామపెద్దలు, ఖాతాదారులు పాల్గొన్నారు.


ప్రతిష్ఠ విగ్రహాలకు విశేష పూజలు



వేంకటేశ్వరస్వామి, దేవతా మూర్తుల విగ్రహాలకు క్షీరాదివాసం నిర్వహిస్తున్న అర్చకుడు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో ఈ నెల 9వ తేదీన ప్రతిష్ఠ జరుగనున్న వేంకటేశ్వరస్వామి, దేవతా మూర్తుల విగ్రహాలకు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. వేద పండితులు ప్రతాపురం గిరిధరాచార్యులు పర్యవేక్షణలో 22 మంది రుత్వికులతో క్షీరాదివాసం, అభివాస హోమాలు నిర్వహించారు. విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ద్రోణంరాజు మల్లిఖార్జునశర్మ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్, మందపాటి కేశవరెడ్డి, దురిశేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి



కళాజాతా నిర్వహిస్తున్న కళాబృంద సభ్యులు

చింతకాని: రానున్న వేసవి దృష్ట్యా.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సాంస్కృతిక కళాబృందం సభ్యులు సూచించారు. సోమవారం మండలంలోని రామకృష్ణాపురంలో ఈ బృంద సభ్యులు వడదెబ్బ, ప్రభుత్వ పథకాలు, గంజాయి వంటి అంశాలపై ఆటాపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నల్లగట్ల మురళి, కళాబృందం సభ్యులు మునగాల వెంకటరత్నం, జల్లా నాగేశ్వరరావు, చాపలమడుగు కోటేశ్వరరావు, బంక భద్రయ్య, బానోత్ రవి తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యంగా బీటీ రహదారి నిర్మాణం



పాతర్లపాడు నుంచి బోనకల్ వరకు నిర్మిస్తున్న బీటీ రహదారి

చింతకాని: మండలంలోని పాతర్లపాడు నుంచి ప్రొద్దుటూరు వరకు బీటీ రహదారిని దౌర్జన్యంగా నిర్మిస్తున్నారని పాతర్లపాడు గ్రామరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల సమ్మతం లేకుండా రహదారి నిర్మాణాన్ని చేయరాదని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. సదరు కాంట్రాక్టర్ స్థానిక నాయకుల అండతో సోమవారం దౌర్జన్యంగా రహదారిని నిర్మిస్తున్నారని రైతులు వాపోయారు. భూమినే ఆధారంగా చేసుకుని జీవించే తాము రహదారుల నిర్మాణంతో విలువైన భూములు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారుల నిర్మాణానికి తాము వ్యతిరేకం కానప్పటికి నష్టపోతున్న భూములకు పరిహారాన్ని ఇవ్వాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇట్టి విషయంపై గ్రామానికి చెందిన బాధిత రైతు గుగ్గిళ్ల భారతమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసింది. వివాదానికి దారితీస్తున్న రహదారి నిర్మాణ పనులను పోలీసులు పరిశీలించారు. దీనిపై వివరణ కోరేందుకు పంచాయతీరాజ్ ఈఈ, డీఈ లను ప్రయత్నించగా స్పందించలేదు.